క్లుప్తంగా

ఉద్యమకారుడి మృతి


మహేందర్ (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, కళాకారుడు బుచ్చల మహేందర్ (44) మృతి చెందాడు. మంగళవారం ఆయనకు గుండె పోటు రావడంతో చికిత్స కోసం హుటాహుటిన హైదరాబాద్ తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కాగా మహేందర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మహేందర్ మృతికి జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సంతాపం తెలిపారు.

మాటిండ్ల అధ్యక్షుడి సస్పెన్షన్

సిద్దిపేటరూరల్: సిద్దిపేట నియోజకవర్గం నారాయణరావుపేట మండల పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ మాటిండ్ల అధ్యక్షుడు రాజేష్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు కొనయ్యగారి ఎల్లయ్య మంగళవారం తెలిపారు. రాజేష్ పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ అధిష్టానం దృష్టికి వచ్చిందన్నారు. హరీశ్‌రావు ఆదేశాల మేరకు ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ డివిజన్ పరిధిలోని న్యూస్ పేపర్ ఏజెంట్ల కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా స్వామి, ఉపాధ్యక్షుడిగా తిరుపతి, కోశాధికారిగా చందులతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

హరీశ్‌రావుకు మద్దతుగా..

సిద్దిపేటరూరల్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి హరీశ్‌రావుకు మద్దతుగా మంగళవారం నారాయణరావుపేట మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హరీశ్‌రావును గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో పార్టీ నాయకులు ప్రభాకర్, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

ఎన్నికల కోఆర్డినేటర్‌గా మహేష్

సిద్దిపేటజోన్: సిద్దిపేట నియోజకవర్గ ఎన్నికల యూత్, విద్యార్థి విభాగాల కోఆర్డినేటర్‌గా మెరుగు మహేష్‌ను మంత్రి హరీశ్‌రావు నియమించారు. అదే విధంగా సిద్దిపేట పట్టణానికి చెందిన నవీన్‌గౌడ్‌ను విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, యాదగిరిని జిల్లా అధ్యక్షుడిగా నియమించారు.

ఏకగ్రీవ తీర్మానం

సిద్దిపేటజోన్: సిద్దిపేట బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి హరీశ్‌రావుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈమేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజుకు తీర్మాన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సిద్దిపేట ముదిరాజ్ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


తీర్మాన పత్రాలను కనకరాజుకు అందిస్తున్న ముదిరాజ్ సంఘం ప్రతినిధులు

కొమురయ్య ఆశయాలను కొనసాగించాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లి గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు కోమ్ముల కొమురయ్య మరణం పార్టీకి తీరని లోటని, ఆయన ఆశయాలను కొనసాగించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కొమురయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం జరిగిన పోరాటాల్లో కొమురయ్య పాత్ర స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు వనేశ్, సృజన్‌కుమార్, గూడెం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

రామంచ వాసికి సన్మానం



శ్రీనివాసచార్యులను సత్కారిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ గ్రామ పురోహితుడు బానంపల్లి శ్రీనివాసచార్యులను జీఎస్ఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈయనకు సోమవారం రాత్రి హైదరాబాద్ పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ చేతుల మీదుగా బంగారు నందితోపాటు జ్యోతిష్య పౌరోహిత కళా విశారద బిరుదు ఇచ్చి సత్కరించారు. శ్రీనివాసచార్యులను గ్రామస్తులు అభినందించారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిళ్లాపూర్‌లో మంగళవారం కాంగ్రెస పార్టీ మానకొండూర్ అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పార్టీలో చేరిన బెజ్జంకి, గాగిళ్లాపూర్ గ్రామాల నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషిచేయాలన్నారు. ప్రచారంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమన్వయ కమిటీ కన్వీనర్‌గా పవన్

హుస్నాబాద్: పట్టణంలోని అనబేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో మంగళవారం సీపీఐ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. సీపీఐ హుస్నాబాద్ నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి తెలిపారు. అలాగే ఎన్నికల కమిటీ సభ్యులుగా కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతిని నియమించారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఏడు మండలాల సీపీఐ ముఖ్య కార్యకర్తలను సమన్వయం చేస్తూ ఎన్నికలకు సిద్ధం చేస్తామన్నారు. పార్టీ తీసుకునే నిర్ణయాలు కార్యకర్తలకు వివరిస్తూ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.


మంద పవన్

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా


మద్దూరు(హుస్నాబాద్): వృద్ధురాలిని ఓటు అడుగుతున్న కొమ్మూరి దంపతులు


నర్మెట: పార్టీలో చేరిన వారితో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

- బీఆర్ఎస్ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారు
- దళిత బంధులో డబ్బులు వసూల్ చేశారు
- కాంగ్రెస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): అభివృద్ధి చేయడానికే మీముందుకు వస్తున్నా, ఈసారి అవకాశం ఇచ్చి ఆదరించాలని కాంగ్రెస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని నర్సాయపల్లి, గాగిళ్లపూర్, రేబర్తి, వంగపల్లి, ఉప్పరౌనిగడ్డ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు తెలంగాణను ఆంధ్ర పాలకులు దోచుకుంటే నేడు తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటోందన్నారు. బీఆర్ఎస్ దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. గత ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన ఒక్కహామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. తపస్‌పల్లి ప్రాజెక్టును నిర్మించి చేర్యాల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. స్థానికుడైన తనను గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని హామీ ఇచ్చారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం ఖాయమని జోస్యం చెప్పారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను మూడు నెలల్లోనే అమలు చేసి తీరుతామన్నారు. అనంతరం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి స్వగ్రామమైన నర్సయాపల్లి గ్రామస్తులు నామినేషన్ కోసం రూ.60 వేల చెక్కును విరాళంగా అందజేశారు. వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, యూత్ అధ్యక్షుడు కమలాకర్ యాదవ్, నాయకులు కామెడి రమేష్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, సర్పంచ్ బాలరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ చెవిటి లింగం, నాయకులు ఆగంరెడ్డి, రమేష్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.


జనగామలో మటన్ దుకాణం వద్ద కొమ్మూరి కోడలు, మహిళా నాయకుల ప్రచారం


జనగామ: శామీర్‌పేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నర్మెట: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, కేసీఆర్ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని పార్టీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పలగడ్డ, హన్మంతాపూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు వంగాల గోవర్ధన్, ఆరె అంజయ్య, పల్లాల లక్ష్మయ్య ఆధ్వర్యంలో సుమారు వందమంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ నాగంపల్లి శ్రీనివాస్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు యాట క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ ప్రజల మద్దతు కొమ్మూరికే..

జనగామ: జనగామ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు నాడు దేవాదుల పథకం కోసం అహర్నిషలు శ్రమించిన జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఈ ప్రాంత ప్రజల మద్దతు ఉందని నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలోని గాయత్రి గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్‌కు పూర్వ వైభవం రాబోతుందని, ప్రజలు చేయి గుర్తుకు ఓటు వేసేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. పార్టీ శ్రేణులు బూత్‌స్థాయిలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీంలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అకుంఠిత దీక్షతో పని చేయాలని కోరారు. గతంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎమ్మెల్యేగా పని చేసిన సమయంలో ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. అనంతరం బూత్ స్థాయిలో పనిచేసే కమిటీల జాబితాను అందించారు. సమావేశంలో జిల్లెల్ల సిద్దారెడ్డి, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, ఉడుత రవియాదవ్, కంచె రాములు, ఎర్రమల్ల సుధాకర్, వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎండీ అన్వర్, చారబుడ్ల దయాకర్ రెడ్డి, వంగాల మల్లారెడ్డి, బనుక శివరాజ్‌యాదవ్, ఆలేటి సిద్దిరాములు, రామగల్ల అరుణవిజయ్, ముస్త్యాల చందర్, గాదెపాక రాంచందర్, జక్కుల వేణు, చెంచారపు బుచ్చిరెడ్డి, చెంచారపు కర్ణాకర్ రెడ్డి ఉన్నారు. కాగా, జనగామ మండలం శామీర్‌పేటలో గడప గడపకు ప్రచారం చేపట్టారు. సమావేశంలో సర్వల నర్సింగరావు, తోటసిద్దులు, రాజు, మహేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

కొమ్మూరి కోడలు ప్రచారం..

పట్టణంలోని గణేశ్‌వాడలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొమ్మూరి కోడలు దివ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర, కౌన్సిలర్ వంగాల కళ్యాణి, దోర్నాల అనిత, సర్పంచ్ సుంకరి నిర్మల, కాముని జయ, మునిబేగం ఆధ్వర్యంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తరఫున ప్రచారం చేశారు.

స్థానిక నాయకుడిని గెలిపించాలి

బచ్చన్నపేట: అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో అందుబాటులో ఉండే స్థానిక నాయకుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొడూరి మహాత్మాచారి అన్నారు. మండల కేంద్రంలోని పలు వార్డుల్లో, అలాగే పలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. నాయకులు నల్లగోని బాలకిషన్‌గౌడ్, వేణువందన, బుర్రా బాలమణి, ఎల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన పార్టీని, అభివృద్ధికి పాటుపడే నాయకుడిని గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఉల్లెంగుల ఏకానందం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దరాజుపేట గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో గ్రామ ఉపసర్పంచ్ రాము, నాయకులు పాల్గొన్నారు.

మానకొండూర్ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేద్దాం

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ గడ్డపై ఈసారి బీజేపీ జెండా ఎగురవేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు పిలుపునిచ్చారు. బెజ్జంకిలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుధవారం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరెపల్లె మోహన్ మానకొండూర్‌లో వేసే నామినేషన్ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు తూముల రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సిద్దిపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన మీరెె గణేశ్ (26) ఈనెల 4వ తేదీన కిరాణ సరుకుల కోసం స్కూటీపై సిద్దిపేట వచ్చాడు. తిరుగు ప్రయాణంలో అదే గ్రామానికి చెందిన గౌటి మహేశ్‌తో కలిసి వస్తూ చిన్నగుండవెల్లి శివారులో రోడ్డుకు అడ్డంగా వచ్చిన గేదెను ఢీకొట్టాడు. దీంతో స్కూటీ నడుపుతున్న గణేశ్ రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడగా, మహేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆ దారిలో వెళ్తున్న చిన్నగుండవెల్లి సర్పంచ్ రఘోత్తంరెడ్డి గమనించి వెంటనే గాయపడిన ఇద్దరిని తన కారులో సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గణేశ్ పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్ తరలించాలని సూచించారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం గణేశ్ మృతి చెందాడు. గణేశ్ తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

మిరుదొడ్డి(దుబ్బాక): ఎదురెదురుగా కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. స్థానికులు, మిరుదొడ్డి పోలీసులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మల్లుపల్లికి చెందిన గొడుగు యాదగిరి (50) మిరుదొడ్డిలో పని ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. దుబ్బాక మండలం లచ్చాపేట గ్రామానికి చెందిన ఉల్లెంగెల బాబు తన కారులో గజ్వేల్ నుంచి లచ్చాపేటకు వెళుతున్నాడు. ఈ క్రమంలో లింగుపల్లి శివారులోని కూడవెల్లి హైలెవల్ బ్రిడ్జి వద్ద కారు, బైక్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ప్రమాదంలో యాదగిరికి తీవ్రంగా గాయపడటంతో స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో తుదిశ్వాస వదిలాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిరుదొడ్డి ఎస్ఐ నరేష్ తెలిపారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డికి టికెట్ కేటాయించడంతో బీజేపీ శ్రేణులు మంగళవారం సంబురాలు నిర్వహించాయి. కార్యకర్తలు ఆయన గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. సిద్దిపేటలోని పార్టీ కార్యాలయం వద్ద టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పిలిస్తే బిడ్డలా అందుబాటులో ఉంటా..


జనగామ: మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి


నామినేషన్ వేసేందుకు వస్తున్న అభ్యర్థి పల్లా, ముత్తిరెడ్డి, రాజయ్య పొన్నాల

- జనగామ నా అడ్డా
- భారీ మెజార్టీకి కష్టపడి పనిచేయాలి
- బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి

జనగామ: నా అడ్డా జనగామ, నేను లోకల్, నిత్యం ప్రజలతో మమేకమవుతూ పిలిస్తే పలికే బిడ్డగా అందుబాటులో ఉంటానని బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనగామ మండలం పసరమడ్ల శివారు సిద్దిపేట రోడ్డు ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేయడమే ఎజెండాగా పరిపాలించిందన్నారు. ప్రస్తుతం ఆ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గడిచిన 8 ఏళ్లుగా ప్రతి రోజు 200 నుంచి 500 మందిని కలుస్తూ, వ్యక్తిగత, ఊరి సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీకి లేనంత విధంగా బీఆర్ఎస్‌కు కార్యకర్తల బలం ఉందన్నారు. క్రమశిక్షణకు మారు పేరుగా నిలిచే బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నికల్లో భారీ మెజార్టీ వచ్చేలా క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేయాలన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో తెలంగాణ పదేళ్లలో 60 సంవత్సరాల అభివృద్ధిని సాధించుకోగలిగామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, కారు గుర్తుకు ఓటు వేయాలని అడగాలన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలంటే జనగామను భారీ మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. నియోజకవర్గంలో మిగతా పార్టీలకు కనీసం ఏజెంట్లు కూడా దొరకని పరిస్థితి ఉందన్నారు. పోలింగ్ పూర్తయ్యే వరకు పార్టీ కేడర్ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అసత్యాలు, అబద్ధాలే ప్రతిపక్షాల ఆయుధాలని, బీఆర్ఎస్‌కు మాత్రం అభివృద్ధి, సంక్షేమ నినాదం ఒక్కటేనని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు ఓర్చుకోవడం లేదన్నారు. ఆరు గ్యారంటీ స్కీంలతో ప్రజలను మభ్య పెట్టి, వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మడం లేదన్నారు. తొమ్మిదిన్నరేళ్లలో ప్రభుత్వం చేపట్టిన పథకాలపై గ్రామం, మండలం, జిల్లా వారీగా సోషల్ మీడియా వారియర్స్ వద్ద పూర్తి సమాచారం ఉండాలని సూచించారు. పార్టీని చీల్చేందుకు కొంతమంది కావాలనే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.


జనగామ: 24వ వార్డులో వృద్ధురాలిని ఓటు అడుగుతున్న నీలిమ

9,24,25 వార్డుల్లో ప్రచారం..

జనగామ పట్టణంలోని 9, 24, 25 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆయన సతీమణి నీలిమ ఇంటింటా ప్రచారం చేశారు. వార్డు ప్రజలు, పార్టీ శ్రేణులు వారికి బాణాసంచా పేల్చి ఘన స్వాగతం పలికారు. వార్డు ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కేసీఆర్ అమలు చేస్తున్న స్కీంలను వివరిస్తూ, భవిష్యత్‌లో జనగామ అభివృద్ధిని వివరిస్తూ ముందుకు కదిలారు. నీలిమ మహిళలు, వృద్ధుల వద్దకు వెళ్లి తన భర్తకు సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలిపిస్తే, ఇప్పుడు జరిగిన అభివృద్ధికి రెట్టింపు చేసి చూపిస్తాడన్నారు. అంతకు ముందు 9వ వార్డు గిర్నిగడ్డలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని పల్లా ప్రారంభించారు.

జనగామ సమగ్రాభివృద్దే ధ్యేయం..

నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే జనగామ సమగ్రాభివృద్దే ధ్యేయంగా ఐదేళ్లు సేవకుడిగా పనిచేస్తానని జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం నామినేషన్ వేసిన అనంతరం పల్లా మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో ఇక్కడకు వచ్చినట్లు స్పష్టం చేశారు. జనగామ నియోజకవర్గం ఇప్పటికే అభివృద్ధి సాధించిందని, ఇంతకు రెట్టింపు చేసేలా తాను కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో జనగామ నంబర్ వన్‌గా నిలిచేలా ఈ ప్రాంత ప్రజలు తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. నియోజకవర్గ పెద్దల సలహాలు, సూచనలతో ముందుకు వెళ్తానని చెప్పారు. ప్రజల దీవెనలతో ఎమ్మెల్యేగా గెలుస్తాననే నమ్మకం బలంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు ఇర్రి రమణారెడ్డి, నిమ్మతిమహేందర్‌రెడ్డి, బండ యాదగిరిరెడ్డి, బండ పద్మ, బక్క నాగరాజు, వీరేందర్‌రెడ్డి, ఎండి సమ్మద్, మసిఉర్ రెహమాన్, మల్లవరపు అరవింద్‌రెడ్డి, పేర్ని స్వరూప, అనిత ఉన్నారు.


జనగామ: 9వ వార్డులో పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

అధికార పార్టీ నాయకుడిని గెలిపించాలి

బచ్చన్నపేట: అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీచేస్తున్న అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని పీఏసీఎస్ చైర్మన్ పులగిళ్ల పూర్ణచందర్ అన్నారు. మండల కేంద్రంలో ఇంటింటా తిరుగుతూ ప్రచారాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు.


నర్సాపూర్ రాయరావు చెరువుకట్టపై ఎండుతున్న మొక్కలు

నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యాలు

ఎండుతున్న మొక్కలు

నర్సాపూర్ రూరల్: ఓ వైపు ఎండుతున్న మొక్కలు.. మరోవైపు మొక్కలు నాటేందుకు తీసిన గోతులు ఇవి అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా కనిపిస్తున్నాయి. నర్సాపూర్ పట్టణంలో కాగజ్ మద్దూర్ రోడ్డు నుంచి రాయరావు చెరువు కట్టపైకి వెళ్లే దారిలో హరితహారం మొక్కలు నాటేందుకు రోడ్డుకు ఇరువైపులా గోతులు తీసి వదిలేశారు. అలాగే నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు రాయరావు చెరువు కట్టపై ఎండుతున్నాయి.


లింగమయ్య ఆలయ సమీపంలో మొక్కలు నాటేందుకు తీసిన గుంతలు